
# నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్

5 | మంగళవారం 9 జూలై 2024 | MAHABUBABAD


## ● 'కుల్లా' క్రమంలో భద్రకాళి



- సాయంత్రం నిత్యక్లిన్నా అలంకారంలో భక్తులకు దర్శనం
- మూడో రోజుకు చేరిన శాకంబరీ ఉత్సవాలు

భద్రకాళి శాకంబరీ నవరాత్రోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడో రోజు సోమవారం ఉదయం అమ్మవారు కుల్లా క్రమంలో, సాయంత్రం నిత్యక్లిన్నా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం, క్షీరాన్నం నివేదించారు. - వరంగల్, జూలై 8



ములుగు జాతీయ రహదారిపై భారీగా నిలిచి ఉన్న వరద నీరు

## వాగు కాదు.. రహదారే..!

- చిన్నపాటి వర్షానికి జలమయం
- వాహనదారులకు తప్పని కష్టాలు
- శాశ్వత పరిష్కారం చూపని ఎన్‌హెచ్ అధికారులు

ములుగు, జూలై 8 (నమస్తే తెలంగాణ) : ఇక్కడ నిండా నీటితో కనిపిస్తున్నది వాగు కాదు.. నేషనల్ హైవేనే. సోమవారం తెల్లవారుజామున రెండు గంటల పాటు కురిసిన వర్షానికి ములుగులోని జాతీయ రహదారి జలమయమై వాహనదారులకు చుక్కలు చూపించింది. వరద భారీగా వస్తుండడంతో వాహనాలు ముందుకు వెళ్లలేక రాకపోకలకు అంతరాయం కలిగింది. బస్సు, లారీ, కార్లు ఎలాగోలా వెళ్తున్నా.. ద్విచక్ర వాహనదారులు వరద దాటలేని పరిస్థితి ఉంది.

అయితే ప్రతి వర్షాకాలం ఈ సమస్య ఎదురవుతున్నా ఎన్‌హెచ్ అధికారులు మాత్రం శాశ్వత పరిష్కారం చూపడం లేదు. చివరకు ములుగు గ్రామ పంచాయతీ సిబ్బంది జేసీబీ సహాయంతో డివైడర్‌ను తొలగించి వరద నీటిని తరలించే పనులను చేపడుతున్నారు. ఎన్‌హెచ్ విస్తరణ పనులు చేపట్టక ముందు ప్రస్తుతం నిలుస్తున్న వరద నీటి స్థానంలో అప్పటి జాతీయ రహదారి కింది నుంచి పంట కాల్వలకు నీళ్లు వెళ్లే మార్గం ఉండేది. సంబంధిత కాంట్రాక్టర్ నీళ్లు వెళ్లేందుకు పైపులను వేయకపోవడంతో పాటు రోడ్డును డౌన్ చేయడం, పంట కాల్వలను కొందరు వ్యక్తులు కబ్జా చేయడంతో చిన్న పాటి వర్షానికి వరద నీరు ఇలా నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

● పుల్లుగా చిల్.. హెల్త్ కిల్



ఆరోగ్యాన్నిచ్చే పాల కన్నా ఒంటిని, ఇంటిని గుల్ల చేసే మందుకు బానిసై తెగతాగేస్తున్నారు. 'మద్యపానం హానికర'మని తెలిసినా కిక్కు కోసం లెక్కలేనన్ని పెగ్గులేస్తూ మత్తులో మునిగితేలుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రోజూవారీగా మద్యం విక్రయాల తీరు ఆందోళన కలిగిస్తున్నది. పాల వినియోగం వేల లీటర్లలో ఉంటే మద్యం సేల్స్ లక్షల లీటర్లు ఉండడం ప్రమాదకర సంకేతాలనిస్తోంది. ఆదాయం కోసం కాంగ్రెస్ సర్కారు అనుసరిస్తున్న విధానాల వల్ల మద్యం మాత్రం విచ్చలవిడిగా దొరుకుతుంటే.. అదే సమయంలో తాగునీటికి మాత్రం ఎప్పుడూ లేని విధంగా కొరత ఏర్పడింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న పలు వార్డుల్లో లెక్కకు మించి బెల్ట్‌షాపులతో మద్యం ఏరులై పారుతోంది. అడ్డూ అదుపు లేని మద్యం విక్రయాలు, వినియోగంతో ప్రజల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి ఛిద్రమవడమే గాక కుటుంబతగాదాలు, ఘర్షణలకు దారితీసి శాంతిభద్రతలపై పెను ప్రభావం చూపుతోంది. ఇటీవల ఉమ్మడి జిల్లాలో మద్యం మత్తులో జరిగిన దారుణాలు పెరుగగా, వాటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరమున్నది.

*- వరంగల్, జూలై 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*





# మద్యం ఏరులై..

### పాల కంటే మందే ఎక్కువ తాగుతున్నరు..

#### ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా మద్యం వినియోగం



- ప్రతిరోజు 2.27 లక్షల లీటర్ల అమ్మకాలు
- పాల విక్రయాలు 74 వేల లీటర్లే
- ఎక్కడచూసినా మందు దుకాణాలే
- ఊరూరా బెల్ట్‌షాపులతో అమ్మకాలు
- పేదల ఆరోగ్యం, ఆర్థికం ఆగమాగం
- శాంతిభద్రతలపై అధికంగా ప్రభావం

వరంగల్, జూలై 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాయం కోసం అనుసరిస్తున్న విధానాలు ప్రజలను ఆగం చేస్తున్నాయి. మద్యం(లిక్కర్, బీర్లు) అమ్మకాలు ఆందోళనకరంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన అధికార వైన్ షాపులు, బార్లతో పాటు ప్రతి ఊరిలోనూ సగటున పది వరకు బెల్ట్‌షాపులు ఉంటున్నాయి. అన్నిచోట్ల విచ్చలవిడి అమ్మకాలతో మద్యం వినియోగం ఆందోళనకరంగా పెరుగుతున్నది. మద్యం అలవాటుతో జనాల ఆరోగ్యం దెబ్బతింటున్నది. తాగుడు అలవాటుతో పేదలు, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఆగమవుతున్నది. కూలీ చేసుకునే వారు సంపాదించే దానిలో సగానికిపైగా మద్యం ఖర్చులకే పోతున్నది. చిన్న ఉద్యోగుల పరిస్థితి ఇలాగే ఉంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం నియంత్రణ లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతిచోట మద్యం అందుబాటులో ఉండడంతో ఎక్కువ మంది దీనికి బానిసలవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 294 వైన్‌షాపులు, 134 బార్లు ఉన్నాయి. లిక్కర్, బీర్లు కలిపి ప్రతి రోజు సగటున 2 లక్షల 27వేల 625 లీటర్ల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. లిక్కర్ 88వేల లీటర్లు, బీర్లు 1,39,625 లీటర్లు అమ్ముడుపోతున్నాయి. జూన్ నెల మొత్తం 27 లక్షల లీటర్ల లిక్కర్.. 43లక్షల 56వేల లీటర్ల బీర్లను వైన్ షాపులు, బార్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమ్మకాలు జరిపింది.

**హనుమకొండలోనే ఎక్కువ**

వరంగల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పరిధిలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు ఉంటాయి. ఆరు జిల్లాల్లో హనుమకొండ జిల్లాలోనే లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. వరంగల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పరిధిలోని మొత్తం మద్యం అమ్మకాల్లో 46 శాతం అమ్మకాలు హనుమకొండ జిల్లాలోనే జరుగుతాయి. హనుమకొండ జిల్లా పరిధిలో ఎక్కువగా నగర ప్రాంతం కావడంతో పాల వినియోగం ఇక్కడే ఎక్కువగా ఉంటున్నది. లిక్కర్, బీర్ల అమ్మకాలు ఇక్కడే అత్యధికంగా ఉంటున్నాయి. హనుమకొండ జిల్లా పరిధిలో ప్రతిరోజు 79వేల లీటర్ల మద్యం అమ్ముడుపోతున్నది. 30వేల 556 లీటర్ల లిక్కర్, 49వేల 680 లీటర్ల బీర్ల వినియోగమవుతున్నది.


**శాంతి భద్రతలపై ప్రభావం**

మద్యం వినియోగం పెరుగుతుండడంతో సమాజంలోని చాలా అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. పేదల ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు శాంతిభద్రతల విషయంలో ఎక్కువగా సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన షాపులకు తోడుగా బెల్ట్‌షాపులు ఉండడంతో ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు మద్యం అందుబాటులో ఉంటున్నది. అర్ధరాత్రి కూడా యథేచ్ఛగా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం వినియోగం పెరగడం వల్ల ఘర్షణలు, కుటుంబ పంచాయితీలు పెరుగుతున్నాయి. మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలకు ప్రధానంగా మద్యమే కారణమవుతున్నది.



### పాల వినియోగం

పాలు నిత్యావసరం. పిల్లలు, పెద్దలు అందరు పాలు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాయం కోసం అనుసరించే విధానాలతో పాల కంటే అనేక రెట్లు మద్యం ఎక్కువగా అమ్ముడుపోతున్నది. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ప్రతిరోజు సగటున 74వేల లీటర్ల పాల అమ్మకాలు జరుగుతున్నాయి. నగర ప్రాంతం ఎక్కువగా ఉన్న హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కలిపి 24వేల లీటర్ల పాలను ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.



### మానుకోటలో 50 వేల లీటర్లు

మహబూబాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ) : పాల కంటే మందే ఎక్కువ తాగుతున్నారని తేలింది. మహబూబాబాద్ జిల్లాలో సుమారు 8 లక్షల మంది జనాభా ఉండగా వీరు సగటున 25 నుంచి 30వేల లీటర్ల పాలను వినియోగిస్తున్నారు. మద్యం మాత్రం జిల్లావ్యాప్తంగా సగటున 50వేల లీటర్ల వరకు విక్రయాలు జరుగుతున్నట్లు ఆబ్కారీ శాఖ లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో 60 వైన్స్, 20 బార్‌లతో పాటు ఒక్కో ఊరికి సుమారుగా పది చొప్పున సుమారు 6 వేలకు పైనే బెల్టు షాపులున్నాయి. జిల్లాలో తాగేందుకు మంచినీరు లేని పల్లెలు ఉన్నాయి కానీ బెల్టుషాపులు లేని ఊరు మాత్రం లేదంటే అతిశయోక్తి కాదు.

**వరంగల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పరిధి(ఆరు జిల్లాల్లో)లో రోజువారీ అమ్మకాలు**

| | |
|---|---|
| లిక్కర్ | 88వేల లీటర్లు |
| బీర్లు | 1,39,625 లీటర్లు |
| పాలు | 74 వేల లీటర్లు |

**హనుమకొండ జిల్లా పరిధిలో అమ్మకాలు**

| | |
|---|---|
| లిక్కర్ | 30,556 లీటర్లు |
| బీర్లు | 49,680 లీటర్లు |
| పాలు | 12 వేల లీటర్లు |

### ములుగులో రూ.30కోట్ల విక్రయాలు

ములుగు, జూలై 8(నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలో రెండు ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో 29 మద్యం దుకాణాలు ప్రభుత్వ అనుమతులతో కొనసాగుతున్నాయి. ప్రతీ నెల జిల్లాలో రూ. 30 కోట్ల వ్యాపారం జరుగుతోంది. రెండేళ్లకోసారి వచ్చే మేడారం మహాజాతర, మినీ జాతరలప్పుడు అదనం. ఏటా 25 శాతం మద్యం అమ్మకాలు పెరుగుతూ వ్యాపారులకు లాభసాటిగా మారుతున్నాయి. అధికారులకు సైతం మంచి గిట్టుబాటు అయ్యేలా మద్యం దందా కొనసాగుతున్నది.

### భూపాలపల్లిలో నీళ్లు నిల్.. మందు ఫుల్

*పాలు రూ.42 లక్షలు.. మద్యం రూ.83 లక్షల విక్రయాలు*

జయశంకర్ భూపాలపల్లి, జూలై 8 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో నీటి సరఫరా సక్రమంగా లేకున్నా మద్యం మాత్రం ఏరులై పారుతోంది. భూపాలపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 19, కాటారం పరిధిలో 12 కలిపి మొత్తం 31 మద్యం షాపుల ద్వారా జూన్ నెలలో రూ.25 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అంటే రోజుకు జిల్లాలో సుమారు రూ.83 లక్షల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా భూపాలపల్లి జిల్లాకేంద్రంలో రోజుకు 40వేల లీటర్లు, మిగతా మండలాల్లో సుమారు 30వేల లీటర్ల పాలు విక్రయిస్తున్నారు. జిల్లాలో సుమారు రూ.42 లక్షల విలువ చేసే 70వేల లీటర్ల పాలు విక్రయిస్తున్నారు. పాలతో పోలిస్తే జిల్లాలో మద్యం విక్రయాలు డబుల్ జరుగుతున్నాయి. జిల్లాకేంద్రంలోని 3, 9, 10, 11, 13, 14, 20, 21, 23, 30వ వార్డుల్లో తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు చెబుతున్నారు. కొన్ని వార్డుల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు లేక తాగునీరు అందడం లేదు. మరికొన్ని చోట్ల పావుగంట, అరగంటకు మించి నీరు రావడం లేదు. కానీ ఈ వార్డుల్లో ఒక్కో చోట పది బెల్ట్ షాపులు ఉంటాయని, ఉదయం నుంచి రాత్రి వరకు మద్యానికి కొరత ఉండదని కాలనీవాసులే చెబుతున్నారు. ఎక్సైజ్ శాఖకు భూపాలపల్లి మద్యం షాపులే అధిక ఆదాయాన్ని ఇస్తున్నాయి.



కుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఇనుగాల వెంకట్రామిరెడ్డి

## వరంగల్‌ను బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

*కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకట్రామిరెడ్డి*

వరంగల్, జూలై 8 : వరంగల్ నగరాన్ని బెస్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కుడా కార్యాలయంలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల మేరకు వరంగల్ చుట్టూ ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్లను పూర్తి చేస్తానన్నారు. ఔటర్ రింగ్ రోడ్లను ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేస్తామని చెప్పారు. కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డికి మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రామ నరసింహారెడ్డి, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే శుభాకాంక్షలు తెలిపారు.

## బడికి.. ఎట్లా పోవాలి సార్?



ఐనవోలు : జలమయమైన కొండపర్తి జడ్పీ పాఠశాల

- రాత్రి కురిసిన స్వల్ప వర్షానికే జలమయమైన కొండపర్తి పాఠశాల
- సైడ్, అండర్ డ్రైనేజీ సమస్యతో నిలిచిన వర్షపు నీరు
- స్కూల్ లోపలికి వెళ్లలేక వెనుదిరిగిన విద్యార్థులు

ఐనవోలు, జూలై 8 : మండలంలోని కొండపర్తి గ్రామంలోని జడ్పీ పాఠశాల రాత్రి కురిసిన స్వల్ప వర్షానికే జలమయం అయింది. గతంలో పాఠశాల కాంపౌండ్ వాల్ ఆనుకొని సైడ్ డ్రైనేజీ ఉండేది. పాఠశాల ముందు నుంచి సైడ్ డ్రైనేజీ ద్వారా అండర్ డ్రైనేజీ లింక్‌తో రోడ్డుకు అటు వైపు వర్షం నీళ్లు పోయేవి. కానీ అండర్ డ్రైనేజీ పైపులు చాలా సంవత్సరాల క్రితం వేసినవి కావడం.. ఆ పైపుల మీదుగా భారీ గ్రానైట్ లారీలు నిత్యం వెళ్లడం వల్ల అండర్ డ్రైనేజీ పూర్తిగా కుంగింది. దీంతో ఆదివారం రాత్రి కురిసిన చిన్న వర్షానికే పాఠశాల ఎంట్రెన్స్ గేటు నుంచి ప్రైమరీ పాఠశాల సమావేశ వేదిక వరకు వర్షపు నీరు నిలిచింది. దీంతో విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలకు వచ్చిన చిన్న పిల్లలు తిరిగి ఇంటికి వెళ్లడంతో విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వెళ్లి దింపి వచ్చారు.

స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి కొండపర్తి పాఠశాల పక్కన సైడ్ డ్రైనేజీ, నీళ్లు రోడ్డు దాటి పోవడానికి అండర్ డ్రైనేజీ, ఈరన్న గుడి నుంచి పీరీల వరకు శాశ్వతమైన సైడ్ డ్రైనేజీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.



## ఉద్ధృతంగా జంపన్నవాగు

వరద నీటిలో మునిగిన ఎల్బాక లోలెవల్ కాజ్‌వే

### ఎల్బాక, పడిగాపూర్‌కు నిలిచిన రాకపోకలు

తాడ్వాయి, జూలై 8 : మేడారంలోని జంపన్నవాగు వరద నీటితో ఉద్ధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో వాగులో వరద నీటి మట్టం భారీగా పెరిగింది. ఎల్బాక, పడిగాపూర్, నార్లాపూర్ గ్రామాల మధ్యలోని లోలెవల్ కాజ్‌వే పూర్తిగా నీటమునిగింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నార్లాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కాజ్‌వేపై నుంచి ఎవరు ప్రయాణించకుండా భారీ గేట్స్‌ను ఏర్పాటు చేశారు. సాయంత్రం కురిసిన భారీ వర్షంతో తాడ్వాయి, కాటాపూర్ రహదారిపై భారీ వృక్షం పడిపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై జేసీబీ సాయంతో తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. మళ్లీ వర్షం పడితే జంపన్నవాగు ప్రమాదకరంగా ప్రవహించే అవకాశం ఉండడంతో ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది వాగు పరిసర గ్రామాల ప్రజలకు జాగ్రత్తలు సూచించారు. వర్షం ఎక్కువగా ఉంటే ఇండ్లల్లో ఉండవద్దని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అన్నారు.

## వారసత్వ నియామకాలు చేపట్టాలి

- కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 81, 85 అమలు చేయాలి
- హనుమకొండ, జనగామ కలెక్టరేట్ల వద్ద వీఆర్‌ఏల నిరసన
- కలెక్టర్లకు వినతిపత్రం సమర్పణ

జనగామ, జూలై 8 (నమస్తే తెలంగాణ)/ హనుమకొండ : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 81, 85 ప్రకారం 60 ఏండ్లు పైబడిన వీఆర్‌ఏల వారసత్వ నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ వీఆర్‌ఏలు సోమవారం హనుమకొండ, జనగామ కలెక్టరేట్ల ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య (వారసత్వ) నియామకాల కోసం 2023 జూలై 24న అప్పటి కేసీఆర్ ప్రభుత్వం జీవో 81, 85 ప్రకారం రాష్ట్రంలోని 20,555 మంది వీఆర్‌ఏల్లో అర్హతలను బట్టి 16,758 మందిని వివిధ ప్రభుత్వశాఖల్లో నియమించి, ఐడీలు ఇచ్చిందన్నారు. అయితే 61 సంవత్సరాల పైబడిన 3,797 మంది వారసులకు ఉద్యోగం ఇవ్వాలన్న ఆదేశాలపై అప్పట్లో కోర్టు స్టే విధించడంతో నియామక ఉత్తర్వులు నిలిచిపోయానని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది నవంబర్ 21న హైకోర్టు డివిజన్ బెంచ్ జీవోపై ఉన్న స్టే ఎత్తివేసినా వీఆర్‌ఏ వారసులకు నియామక ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైందని, అందులో ఇప్పటికే 17 మంది మరణించారని వాపోయారు. జీవో ప్రకారం విద్యార్హతల సర్టిఫికెట్లు, కుటుంబ సభ్యుల నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, అఫిడవిట్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వానికి సమర్పించి 11 నెలలైందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ వారసులకు నియామక ఉత్తర్వులు ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ వీఆర్‌ఏలు హనుమకొండ, జనగామ జిల్లాల కలెక్టర్లు పీ ప్రావీణ్య, షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు.



జనగామ కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న వీఆర్‌ఏలు

## రోడ్డు పైకి వరద, నిలిచిన రాకపోకలు

మంగపేట, జూలై 8 : మంగపేట మండలంలోని కొత్తూరుమొట్లగూడెం, తిమ్మాపురం, దోమెడ, తక్కళ్లగూడెం తదితర గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో కప్పవాగు, ముసలమ్మవాగు, గౌరారం, కమలాపురం ఎర్రవాగుల్లో వరద పెరిగింది. తక్కళ్లగూడెం వద్ద వరద ప్రవాహం రోడ్డుపై కొచ్చింది. కొత్తూరుమొట్లగూడెం-బొమ్మాయిగూడెం నడుమ గౌరారం వాగు రోడ్డుపై నుంచి ఉద్ధృతంగా ప్రవహించడంతో రోజంతా రాకపోకలు నిలిచిపోయాయి. వరద పెరగడంతో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అత్యవసరం ఉంటే అధికారుల సహాయం పొందాలని పంచాయతీ సిబ్బంది గ్రామస్తులకు సూచనలు చేశారు.



తక్కళ్లగూడెం సమీపంలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద